త్యాగధనుల స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: త్యాగధనుల పోరాట ఫలితమే నేటి స్వాతంత్ర్య దినోత్సవమని, వారి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ పిలుపు నిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని స్టాలిన్ ఎగుర వేసి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది పోరాడారని, అమరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలు చేస్తామని అన్నారు. పెదపూడి దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు జి.ఆనంద్, పల్లెటి పోలయ్య, కె.పోతన్న, అప్పారి విష్ణు మూర్తి, కె.మాధవ రావు, శివ, మహిళా సమాఖ్య నాయకురాలు కె.వనజాక్షి పాల్గొన్నారు.

మధురవాడ: భారత స్వతంత్ర్య సాధనలో సమిధలైన మహనీయులను స్మరించుకుంటూ పోరాటాలకు సన్నద్ధమవుదామని మధురవాడ ఏరియా సీపీఐ కార్యదర్శి వాండ్రాశి సత్యన్నారాయణ పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం మధురవాడ సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. మధురవాడ క్వారీ సొసైటీ ప్రెసిడెంట్ పిల్ల అప్పన్న జాతీయ పతాకాన్ని ఎగర

వేశారు. ఈసందర్భంగా ఏరియా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ జాతిపిత గాంధీ మహాత్ముని అహింస పోరాటంతో పాటు, భగత్ సింగ్, సుఖ దేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ తదితర పోరాట యోధుల త్యాగాలతో సాధించుకున్న ఈ స్వాతంత్ర్యం నేటికీ 78 ఏళ్లయినా ఆ ఫలాలు అందరికీ అందడం లేదన్నారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పార్టీలు ఆ ప్రజలనే దోచుకుంటున్న విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం సీపీఐ పార్టీ పోరాటాలు సాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా ముఠా కళాశీల మేస్త్రి బంగారయ్య, సీనియర్ కామ్రేడ్ పెంటపల్లి కాంతమ్మ, కే.అరుణ్ కుమార్, త్రినాధ్, ముఠా కార్మికులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద 15, 16వ వార్డు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 15వ వార్డు అధ్యక్షులు ఎస్.మధు రెడ్డి మాట్లాడుతూ ఆనాడు ఈ దేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారతదేశం విముక్తి కోసం ఎంతోమంది మహానుభావులు తమ ప్రాణ త్యాగాలను అర్పించిన మహాత్మా గాంధీ, అల్లూరి, జవహర్లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ లాంటి స్వతంత్ర సమరయోధులు సాధించిన భారతదేశంలో ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరిక నిర్మూలన పెరుగుతూనే ఉందన్నారు. ఈ దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు పేదవాడి పక్షానని చెప్పుకుంటూ, ఉన్నవాడు మాత్రం సంపన్నుడు అవుతున్నాడు అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం యువత అంతా మరో స్వాతంత్ర్య పోరాటానికి నడుం బిగించి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వడాల గోవింద్, ఏఐవైఎఫ్ 15వ వార్డు ఉపాధ్యక్షులు బాలు, 16వ వార్డు అధ్యక్షులు రావి అశోక్, మణికంత, హరీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ : స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ అందే విధంగా ప్రభుత్వాల పాలన ఉండాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రెహమాన్ రహిమాన్, సిహెచ్. కాసుబాబు అన్నారు. ఆరిలోవ బి.టి.ఆర్. నగర్, ఆరిలోవ కాలనీ చివర బస్టాప్ శ్రీ ఆత్మీయత ఆటో స్టాండ్, పెద్ద వాల్తేరు, బీచ్ రోడ్డు కురుపాం ఆటో స్టాండ్, ఆర్కే బీచ్ ఆటో స్టాండ్, సెవెన్ హిల్స్ అండ్ విశ్వభవన్ ఆటో స్టాండ్, 28వ వార్డు పిఠానదిబ్బ తదితర ప్రాంతాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం సంగ్రామంలో మా దేశాన్ని విడిచి పొండి అంటూ ఒకే ఒక్క నినాదంతో 1855 సిపాయిల తిరుగుబాటు నుండి 1942 క్విట్ ఇండియా ఉద్యమ దాకా ప్రాణ త్యాగాలు చేసి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించారని అన్నారు. ఇప్పటికి 77 సంవత్సరాలు పూర్తయినా పేద, మధ్య తరగతి, కార్మిక వర్గానికి స్వాతంత్ర ఫలాలు అందని ద్రాక్ష వలే ఉన్నాయని అన్నారు. ప్రజాప్రతి నిధులందరూ సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలు, కార్మిక హక్కుల పరిష్కారం కొరకు మరో స్వాతంత్రం ఉద్యమానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులపై భారాలు వేసే జీవో 21, 31 లను.., నాలుగు లేబర్ కోడ్ లను, ఆన్ లైన్ కేసులను ఎత్తి వేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇ- చలానాలను తగ్గించాలని, భారీగా పెంచిన ఆర్.టీ.ఏ ఫలాని ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ ఏరియా సిపిఐ శాఖ కార్యదర్శి కె. లక్ష్మణరావు ఏ.ఐ.వై.ఎఫ్. కె.సందీప్ రాజాన ములయ్య, వెంకట్రావు, గారా శ్రీను, బాలాజీ, శ్రీను, వాసు, త్రినాధ్, లక్ష్మి, కళావతి, జి.నారాయణరావు, రాము, కె.వెంకట్రావు, రమణ, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: దేశంలో మోదీ పాలనలో కొందరికే స్వాతంత్ర్య ఫలాలు అందుతున్నాయని, మిగిలిన వారు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉండిపోతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు ఆవేదన వెలిబుచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీవిఎంసీ 97వ వార్డు గిరిప్రసాదనగర్, బర్దన్ నగర్‌లలో జాతీయ పతాకాలను ఆయన ఎగుర వేసారు. అనంతరం పార్టీ నాయకులు అసిరినాయుడు, రాము, రమణ, చిన్నారావు, అనూరాధ, అన్నపూర్ణ తదితరులతో కలిసి బర్దన్ నగర్‌లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్న ప్రదాని మోదీ, సమాజంలోని పేదలను మరింత పేదలుగా మార్చుతున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయయని, మతపరమైన అల్లర్లకు అడ్డుకట్ట లేదని ఆయన ఆరోపించారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం మల్కాపురం సీపీఐ గ్రామ మండల వద్ద పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేకులు సత్యాంజనేయ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. జిల్లా పరివర్గ సభ్యులు గుడాల రాంబాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మల్కాపురం నగరాల సంఘం వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులు భోగవెల్లి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్ర ఆటగాళ్లు ఎంపిక

విశాలాంధ్ర - పీఎం పాలెం: వచ్చే నెల 5వ తేదీన బెంగుళూరులో మొదటి మ్యాచ్, అనంతపురంలో మిగిలిన 5 మ్యాచ్‌లతో ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌షిప్‌కు ఆంధ్ర నుండి ముగ్గురు ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఎంపికయ్యారు. టీమ్-డికి ప్రాతినిధ్యం వహించడానికి కె.ఎస్.భరత్, రిక్కీ భుయ్, అదేవిధంగా టీమ్-బికి ప్రాతినిధ్యం వహించేందుకు నితీష్ కుమార్ రెడ్డి ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

సుప్రీం కోర్టు జడ్జికి ఆత్మీయ స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మూడు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జె.కె.మహేశ్వరికి విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభించింది. గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి విశాఖ వచ్చిన ఆయనకి విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె. ఫక్కీరప్ప, శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తులు గోపి, సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్పోర్ట్ లాంజులో జిల్లా కలెక్టర్, జాయింట్ పోలీస్ కమిషనర్, ఇతర న్యాయమూర్తులు సుప్రీం కోర్టు జడ్జితో కాసేపు వివిధ అంశాలపై మాట్లాడారు.

వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సమాజంలో అందరూ సమానంగా ఎదిగినప్పుడు, విద్యా, వైద్య సేవలను సంపూర్ణంగా పొంది, పేదరికం నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విశాఖపట్నం పోలీసు బ్యారెక్స్ మైదానంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. పరేడ్ కమాండర్ ఏఆర్ ఏసీపి సీతారామ్ ఆధ్వర్యంలోని పోలీసు దళం మంత్రికి సెల్యూట్ సమర్పించగా, బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు ప్రత్యేక వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం అతిథి సభా వేదిక వద్దకు చేరుకొని త్రివర్ణ బెలూన్లను గాలిలోకి వదిలారు. దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరులను ముందుగా స్మరించుకున్నారు. ఈ మధ్యకాలంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు ప్రజలు ముఖ్యంగా యువత బానిసలవుతున్నారని, ఇది చాలా ఆందోళన కలిగించే అంశమని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల రహిత భారత దేశాన్ని నిర్మించడానికి అందరూ సమిష్టిగా నిబద్ధతతో కృషిచేద్దామని పిలుపునిచ్చారు. భవిష్యత్తును తీర్చిదిద్దే సత్తా ఉన్న యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు చేపట్టే గ్రౌండ్ లెవెల్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని వాటిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి స్థిరమైన అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పర్యావరణ హిత పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు.

ప్రశంసా పత్రాలను ప్రధానం చేసిన మంత్రి

రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 416 మంది అధికారులు, సిబ్బందికి మంత్రి సర్టిఫికేట్లను అందజేశారు. ఈ వేడుకల్లో విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకు మిల్లి శ్రీభరత్, శాసనమండలి సభ్యులు వి.చిరంజీవిరావు, డి.రామారావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణు కుమార్ రాజు, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, గండి బాబ్జి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ పోలీసు కమిషనర్ డా. కె.ఫక్కీరప్ప, డీసీపీ కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, విఎంఆర్డిఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాధన్, జీవిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డిఓ హుస్సేన్ సాహెబ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ, డిఈఓ కె.చంద్రకళ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.అప్పలస్వామి, డిఎంహెచ్ఓ డా. పి.జగదీశ్వర రావు, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి జాతీయ జెండాను ఎగురవేసారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రతి గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన సమగ్ర సర్వేలో గుర్తించిన 2,814 పివిటిజి గిరిజన ఆవాశాల్లో 23,807 ఇళ్లకు గాను, సుమారు 21,828 ఇళ్లకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించామని, మిగిలిన వాటిని సెప్టెంబర్ నాటికి పూర్తి చేయనున్నామని తెలిపారు. కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా, ఏ కార్యాలయానికి తిరగకుండా రైతు కేవలం తన ఫోన్ నుంచి నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్ నంబర్ 1912 కు ఫోన్ చేసి కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ను పొందే నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని ప్రారంభించామన్నారు. తద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 93 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏ.వి.ఎల్.ప్రసన్నకుమార్, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎస్.మసిలామని, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, బి.అశోక్ కుమార్, ఎన్.వి.రమణమూర్తి, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోన్ 3లో: ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ జోన్ 3 మధురవాడ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణ చేసిన ఆయన అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచారు. స్వాతంత్ర ఫలాలు అందరికీ అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

జివిఎంసిలో: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జివిఎంసి కమీషనర్ పి.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్, అధికారులతో కలిసి ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ మాట్లాడుతూ 78వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా మహాత్ముల త్యాగనిరతిని గుర్తు చేస్తూ సందేశాన్ని అందించారు. ఈ సందేశంలో మన భారతదేశం 2047 నాటికి సంపూర్ణ వికసిత భారతదేశంగా ఆవిర్భావమునకు మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జివిఎంసి సెక్రటరీ పి.నల్లనయ్య రచనా సహకారంతో మాధవధార హైస్కూల్ విద్యార్థులచే "సకాలంలో పన్నులు చెల్లించండి", "క్లీన్ అండ్ గ్రీన్ విశాఖ" అనే దృశ్య రూపకాలను, కప్పరాడ, రేసపువానిపాలెం జివిఎంసి బాల్యం సెంటర్ల విద్యార్థులచే దేశ భక్తి గీత రచనపై దృశ్య రూపకాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం జివిఎంసి నందు ఉత్తమ ప్రతిభను, సేవలను కనబరచిన 279 జివిఎంసి అధికారులకు, ఉద్యోగులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి, పలు బ్యాంక్ ప్రతినిధులకు జివిఎంసి కమీషనర్ ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కింగ్ జార్జ్ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో వైద్యులు, నర్సింగ్, మినిస్టీరియల్, పారామెడికల్, నాల్గవ తరగతి సిబ్బంది, సెక్యూరిటీ శానిటేషన్ సిబ్బంది జెండా వందనంకు హాజరయ్యారు. సూపరింటెండెంట్ డా.శివానంద జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని అందువలన అధిక సంఖ్యలో రోగులకు చికిత్స అందిస్తున్నామన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) సిహెచ్ శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ నేడు స్వేచ్ఛా భారతావనిలో సమానత్వం స్వాతంత్ర్యం సామాజిక న్యాయం మనం పొందడానికి కారణమైన అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ భారత దేశం ఔన్నత్యాన్ని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందిని సూపరింటెండెంట్ చేతుల మీదుగా మెమెంటోలు సర్టిఫికెట్‌లతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డా.రాదా కృష్ణ, డా.వాణి, డా.రవి, ఆర్‌యంఓ డా.బి. భాస్కర్‌రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.కిరణ్, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ మంగరాజు, మేనేజర్ జవహర్ అకౌంటెంట్ సత్యనారాయణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలంలో గురువారం అంగరంగ వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు సమక్షంలో జెండా ఎగరవేశారు. మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు చిత్రపటాలకి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జెండా ఎగరవేసి భారతదేశ స్వాతంత్ర సమరయోధుల యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. పంచాయతీలో చేస్తున్న సేవలకు గాను పారిశుద్ధ కార్మికులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ కోన పైడిరాజు, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, కోన శ్రీను, సత్యనారాయణ, అప్పలరాజు, ఉప సర్పంచ్ రమణమ్మ, సంతోష్, సురేష్, లక్ష్మి, వార్డ్ మెంబర్లు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం భీమిలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి తరాల బాగు కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం దేశ ప్రజల కర్తవ్యమని అన్నారు. ప్రతి ఒక్క ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేయడం ద్వారా వారికి ఘన నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం తెలుగు జాతికి ఎంతో గర్వ కారణమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.ఎ.వి.రాజు, గాదు అప్పలనాయుడు, చిక్కాల విజయ్ బాబు, గాదు వెంకటప్పడు, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో అందరం ముందుకి సాగాలని జనసేన నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం జనసేన నగర పార్టీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు ఎంతోమంది చేసిన త్యాగాలను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రం, దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ శంకర్, వివిధ నియోజవర్గ ఇన్చార్జిలు శివప్రసాద్ రెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్, అంగప్రశాంతి, ఉత్తరాంధ్ర జిల్లాల మహిళా కో ఆర్డినేటర్‌లు లక్ష్మి చౌదరి, కిరణ్ రావు, సారానిదేవి, అమరావు దుర్గ, జిల్లా నాయకులు, గ్రేటర్ విశాఖ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్‌లు, వార్డ్ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వీఎమ్మార్డీఏలో

విశాలాంధ్ర - విశాఖ : బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుండి అఖండ భారతావనిని విముక్తులను చేసేందుకు ఎందరో మహనీయులు త్యాగాలు చేసారని, ఫలితంగా మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారి త్యాగాలను మనం నిరంతరం గుర్తు చేసుకుంటూ దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని వీఎంఆర్డీఏ ఎంసీ కె.ఎస్. విశ్వనాథన్ పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం వీఎంఆర్డీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశం ప్రపంచంలోనే 5వ అతి అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భముగా ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యమంలో కార్యదర్శి డి.కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్న కుమార్, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, వీకే పీసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఎందరో మహనుభావుల త్యాగఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి బాధ్యతతో మరింత సమర్థంగా ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. వ్యక్తులుగా ప్రతి ఒక్కరు శక్తివంతమైన ఆదర్శాలు, భావాలతో దేశంలోని పలు సమస్యలను సమర్థంగా పరిష్కరించవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులను సమాజం గురించి ఆలోచించే వ్యక్తిత్వం ఉన్న వారుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత అధ్యాపకులదే నన్నారు. జిమ్‌సర్ ప్రోవిసి ప్రొఫెసర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణ శేఖరన్, క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్, గీతం సెక్యూరిటి డైరెక్టర్ బిక్రంమ్, ఎన్‌సిసి అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, వివిధ కళాశాలల డీన్‌లు, డైరెక్టర్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: విద్యా రంగంలో అగ్రగామి, లీడర్‌గా ఏయూను నిలపడం లక్ష్యంగా సమిష్టిగా పనిచేస్తామని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. ఏయూలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏయూలోని మహాత్మగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య కట్టమంచి రామలింగా రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసారు. అనంతరం ఏయూ న్యాయ కళాశాల వద్దనున్న మైదానంలో జాతీయ పతకాన్ని ఎగురవేసారు. అనంతరం విద్యార్థులను, ఆచార్యులను, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల నుంచి వచ్చే ప్రతీ ఆలోచన ఎంతో విలువైనదని, ఆవిష్కరణలకు

సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తామన్నారు.విశ్వవిద్యాలయం వ్యవస్థలో విద్యార్థులే అత్యంత కీలకమన్నారు. అత్యుత్తమ విద్య, వనరులతో విద్యార్థుల ఆకాంక్షలను సాకారం చేసే విధంగా సమిష్టిగా పనిచేస్తూ సమున్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇక్కడ కేవలం విద్యను పొందడమే కాకుండా, విద్యార్థులను అన్ని రంగాలలో నిపుణులుగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. సానుకూల దృక్పథంతో పనిచేస్తూ కలసి లక్ష్యం దిశగా సాగుతూ విశ్వవిద్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం ఎన్‌సిసి, క్రీడలు, జాతీయ సేవా పథకంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను బహూకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, ఎం.వి.ఆర్ రాజు, కె.సీతామాణిక్యం, జి.గిరిజా శంకర్, ఆర్.పద్మశ్రీ, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు లాభాలను సాధించేందుకు ప్రతి ఉద్యోగి విలువ సృష్టికర్తగా మారాలని విశాఖ స్టీల్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. ఉక్కు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎండీ అతుల్ భట్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వృద్ధి

గురించి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు 2023లో 1.6 శాతం నుండి 2024లో 1.7 శాతానికి కొద్దిగా వేగవంతమైన వృద్ధిని చూడగలిగాయని, 2024-25సమయంలో భారత ఆర్థిక వ్యవస్థకు 7.2% జిడిపి వృద్ధిని ఆర్‌బిఐ అంచనా వేసిందని అన్నారు. ప్రపంచ ఉక్కు అంచనాల ప్రకారం ఈ సంవత్సరం డిమాండ్ 1.7% పుంజుకుని 1,793 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అన్నారు. అనంతరం సీఐఎస్ఎఫ్‌కు చెందిన ఫైర్‌ఫైటింగ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రైఫిల్ రిఫ్లెక్స్ షూటింగ్ టీమ్‌ల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. జాతీయ త్రివర్ణ పతాకాన్ని ప్రతిబింబించే అగ్నిమాపక బృందంచే కలర్ జెట్ సభికులను ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) పాండే, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్, డైరెక్టర్ (కమర్షియల్) ప్రసాద్, మహిళా విస్టీల్ సమితి అధ్యక్షురాలు నూపూర్ భట్, కార్యవర్గ సభ్యులు అత్తార్ మహమ్మద్ హనీఫ్, సీనియర్ కమాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ మిని ఫ్యామిలీ కూపర్ ఎస్, ఆల్-ఎలక్ట్రిక్ మిని కంట్రీమ్యాన్ విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: బీఎండబ్ల్యూ నుంచి న్యూ మిని ఫ్యామిలీ న్యూ మిని కూపర్ ఎస్ న్యూ ఆల్-ఎలక్ట్రిక్ మిని కంట్రీమ్యాన్ విడుదల చేశారు. కార్లు పూర్తిగా బిల్ట్-అప్ యూనిట్లుగా అందుబాటులో ఉంటాయి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మిని ఆథరైజ్డ్ డీలర్స్‌తో పాటు షాప్ డాట్ మినీ డాట్ ఇన్ లో కూడా బుక్ చేసుకోవచ్చు. సెప్టెంబరు 2024 నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. బీఎండబ్ల్యూ ఫిఫ్త్ జనరేషన్ మిని కూపర్ ఎస్ ఎలక్ట్రిఫైడ్ థర్డ్ జనరేషన్ మిని కంట్రీమ్యాన్ మిని బాడీ లాంగ్వేజ్ మూలాల ప్రాథమిక సూత్రాలతో ప్రోగ్రెసివ్ టెక్నాలజీని మిళితం చేస్తాయి. అవి న్యూ వ్యక్తిత్వాన్ని, హాల్‌మార్క్ డ్రైవింగ్ డైనమిక్స్‌తో వినూత్న పంచ్‌ను సంయుక్తంగా ప్యాక్ చేస్తాయి.

విద్యార్థులకు అక్షర భారతి ఫౌండేషన్ నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని సరిపల్లికి చెందిన అక్షరభారతి ఫౌండేషన్, ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులందజేసి వారిని ప్రోత్సహిస్తోంది. సరిపల్లిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ సంస్థ వ్యవస్థాపకులు జెసిబి ప్రసాద్ 2024 లో పదవ తరగతి పరీక్షలలో మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి 20 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు పదివేలు చొప్పున అందజేశారు. వీటితో పాటుగా సరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు 10 వేలు చొప్పున, మరో ఐదుగురికి ఐదు వేలు చొప్పున పంపిణీ చేసారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు. ఇంకా దేశ రక్షణ రంగంలో పనిచేసిన విశ్రాంతి ఉద్యోగులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి జెసిబి ప్రసాద్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా అక్షర భారతి ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ్ కళాశాలలో 13వ వార్షిక స్పోర్ట్స్ మీట్ మెడల్స్ ప్రధానం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీ లో 13వ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఆగస్టు 12 నుండి 14 వరకు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలియజేశారు. కళాశాలలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్పోర్ట్స్ మీట్ విజేతలకు గురువారం బహుమతులను అందచేసారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టి. మార్త మెరియల్ త్రివర్ణపతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ మాట్లాడుతూ 78వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదర్శ్ కాలేజీలో నిర్వహించిన పోటీలలో పురుషుల విభాగంలో కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీ రన్నింగ్, చెస్, క్యారమ్స్, మహిళా విభాగంలో కోకో, కబడ్డి, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, త్రోబల్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, మొదలగు క్రీడలలో సుమారుగా 330 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరిలో 160 మందికి స్వర్ణం, రజితం, కాంస్యం పతకాలతో పాటు సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేసామని ఆయన వెల్లడించారు. స్పోర్ట్స్ మీట్ కోఆర్డినేటర్స్ గా డి.సింహాచలం, బి.ఆర్.జి పరిమళ, ఠాగూర్ రమ్య వ్యవహరించారు.

ఈపీఎస్ భాగ్యలక్ష్మికి పురస్కారం

విశాలాంధ్ర - మల్కాపురం: స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకంలోని జిల్లా ప్రోగ్రాం అధికారైన ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మికి ఉత్తమ డి.పి.ఓ.గా ప్రశంసా పత్రం , 2022- 23 సంవత్సరానికి జిల్లా స్థాయిలో ఉత్తమ వలంటీర్ గా వి.అలేఖ్య కు, 2023-24 సంవత్సరానికి గాను యూనివర్సిటీ స్థాయిలో గా ఉత్తమ వలంటీర్ గా కె.లావణ్యకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి. శశి భూషణరావు ప్రత్యేక ప్రశంసా పత్రాలను, మెడల్స్ ను ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ అవార్డులను స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ బాస్కెట్ బాల్ గ్రౌండ్స్ లో ఉపకులపతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీరందరినీ సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది, వాలంటీర్లు అభినందించారు.

సమాచార శాఖ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సమాచార శాఖ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డివిజనల్ పౌర సంబంధాల అధికారి డి.నారాయణరావు, ఆఫీస్ సబార్డినేట్ ఎస్.కె.ఖాదర్ బాబాలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 416 మంది అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు.

అప్పన్న హస్తం అందించిన హర్షసాయి

- ఊపిరితిత్తుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్న 'శ్రావ్యకు రూ.5 లక్షల ఆర్థిక సాయం"

విశాలాంధ్ర - విశాఖపట్నం : రాష్ట్రవ్యాప్తంగా తన పరిధి మేరకు ఆపదలో ఉన్న వారిని తానున్నానంటూ ధైర్యాన్ని కల్పించడమే హర్ష సాయి నైజం. ఒకవైపు యువతను సమాజ అభివృద్ధిలో భాగస్వాములు చేస్తూ మరోవైపు తనదైన దాతృత్వాన్ని చాటుకున్నారు . ఈ నేపథ్యంలో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శ్రావ్య ఉమాది తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తో ప్రాణాపాయ స్థితిలో పోరాడుతుంది. తక్షణమే ఈ విషయాన్ని తెలుసుకున్న హర్ష సాయి స్పందించి శ్రావ్యా ను పరామర్శించారు. తనకేమీ కాదని ధైర్యాన్ని కల్పించారు. కుటుంబ సభ్యులతో సుదీర్ఘంగా మాట్లాడి. వైద్యానికి ఎంత అవసరం అవుతుందో అడిగి తెలుసుకున్నారు. కాసేపు శ్రావ్య పరిస్థితిని చూసి చలించిపోయారు. అక్కడికక్కడే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించారు. స్వయంగా చెక్కును కుటుంబ సభ్యులకి అందజేసి తాను ఉన్నానంటూ మరోసారి భరోసా కల్పించారు.

జీ తెలుగులో మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి' ప్రేమలు

విశాలాంధ్ర/విశాఖపట్నం: శ్రావణమాసం ప్రత్యేకంగా ఆదోని వేదికగా నిర్వహించిన జీ తెలుగు మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి'ని ఆగస్ట్ 18వ తేది మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం చేయనుందనీ సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. సరికొత్త సినిమాలతో అలరించే జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమా ప్రేమలుని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందించేందుకు సిద్ధమైందన్నారు. నస్లెన్ కె గఫూర్, మమితా బైజు నటించిన ప్రేమలు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ఆగస్టు 18 సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. జీ తెలుగు ఇటీవల ఆదోనిలో ప్రముఖ నటీనటులతో శ్రావణమాసం ప్రత్యేక కార్యక్రమం 'శ్రావణలక్ష్మి' మెగా ఈవెంట్ని నిర్వహించి వీక్షకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందించిందన్నారు. జీ తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న జాబిల్లికోసం ఆకాశమల్లే, మా అన్నయ్య సీరియల్స్ నటీనటులు ఈ వేదికపై నుంచి తమ అభిమానులతో సంభాషించి వారి సంతోషంలో పాలుపంచుకున్నారన్నారు.

దేశ పురోగతిలో అందరం భాగస్వాములు కావాలి

-తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశ పురోగతిలో అందరం భాగస్వాములు కావాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పిలుపునిచ్చారు. పాత వెంకోజీపాలెంలోని ఎంవీవీ ప్రెసిడెన్సీలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నుంచి రక్షణ పొందేందుకు కుల మతాలకు అతీతంగా అనేకమంది ప్రాణత్యాగాలు చేసి పోరాటం చేశారన్నారు. వారందరి త్యాగ ఫలితంగానే ఈరోజు దేశం స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటుందని తెలిపారు. మరోవైపు దేశాన్ని అభివృద్ధి చేసే క్రమంలో కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా 11వ సారి ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే 10 ఏళ్లలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలు స్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ఏ.ఎన్.ఉదయ్ కుమార్, ఎస్.ఆదినారాయణ, కే.గోపాలకృష్ణ, వై.సుభిది, పి సరిత, కె.ప్రతిమ, ఎం.ఆశ, ఎన్. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

ఎంపీడీవో, ఈఓపీఆర్డీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు అవార్డులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఉత్తమ సేవలకు గాను ఆనందపురం మండల ఎంపీడీవో ఎన్. అప్పలనాయుడుకు, ఆనందపురం మండల పరిషత్ ఈఓపీఆర్డీ రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణికంఠకు అవార్డులు లభించాయి. ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డును జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, రెవెన్యూ మినిస్టర్ ఏ.సత్యప్రసాద్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

జగన్‌తో మండల వైస్ సర్పంచ్ పాండ్రంకి శ్రీను

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో కొన్ని ప్రధాన సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్ళారు. కూటమి ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం కాకపోతే పల్లె యాత్ర ద్వారా నేరుగా వచ్చి ఫిర్యాదులు స్వీకరిస్తానని జగన్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో కోరాడ ముసలినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల విన్యాసాలు అద్భుతం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో శొంఠ్యాం గ్రామంలో శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాల విద్యార్థులు పలు విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. పాఠశాల యాజమాన్యం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని చేపట్టిన సంస్కృత కార్యక్రమాలు విన్యాసాలు ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్, కరాటే, సంస్కృతి కార్యక్రమాలు సూపర్లను ఆకట్టుకున్నాయి. దేశభక్తిని చాటే విధంగా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీలో గెలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లెంక రాంబాబు , జనసేన నాయకులు కోరుకొండ మూర్తి , అచ్చి బాబు , కోరాడ వెంకట రమణ ,బొత్స రాము , సియాద్రి అప్పారావు , గొలజాన రవి , శ్రీ వెంకట్ విద్యా పీఠ్ డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు , టీచర్స్,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం

క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి విశాఖపట్నం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె రాజు పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి.తిరుపతి రాజు, ఏఎల్‌యన్.రాజు, డిఎస్‌పి. వర్మ, హరివర్మ, అంజిబాబు, డి ఎస్ వర్మ,14 వార్డ్ కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు,ప్రవీణ్, కిషోర్, గోపి, క్షత్రియ యూత్ శ్రవణ్ వర్మ, అభి, రాజా, కిరణ్, డివిఎస్‌పి వర్మ, క్షత్రియ సమితి పెద్దలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం పాలెం: ఎండాడ, లా కాలేజ్ రోడ్‌లో ఉన్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖ పట్నం జిల్లా సేవాదల్ అధ్యక్షులు దాడి రమేష్ నిర్వహణలో విశాఖ పట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు అధ్యక్షతన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకులు జరిగాయి. మహాత్మా గాంధి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించిన అనతరం రాజ్యసభ సభ్యులు గొల్ల బాబు రావు జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ , డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగి రెడ్డి , మాజీ శాసన సభ్యులు మళ్ళ విజయ ప్రసాద్ , తైనాల విజయ కుమార్ , ఎస్.ఎ రెహమాన్, చింతలపూడి వెంకట రామయ్య , రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి జి రవి రెడ్డి, రొంగలి జగన్నాథం, రాష్ట్ర ఫిషరీస్ మాజీ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర , రాజు (వుడా రవి), జాన్ వెస్లీ , పిల్లా సుజాత సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి నడుంపల్లి కృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి దేవర మార్కేయులు, జోనల్ ఇన్చార్జ్ లు అల్లంపల్లి రాజాబాబు, పార్టీ నాయుకులు జహీర్ అహ్మద్, చిన్న దాస్, జగ్గు పల్లి అప్పల రాజు జిల్లా అనుబంధ విభాగాలు అధ్యక్షులు అడ్డాల కృపా జ్యోతి , అప్పన్న, వానపల్లి శ్వరరావు, బోని శివ రామ కృష్ణ , బొండా ఉమా మహేశ్వర్ రావు, అప్పల స్వామి నాయుడు, శంకర బద్దుల ప్రసాదు, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, కో ఆప్షన సభ్యులు ఎండి షరీఫ్, రాష్ట్ర, జిల్లా అనుబంధ కమిటీ కాళిదాస్ రెడ్డి, కే రామన్న పాత్రుడు, పిల్ల సత్యనారాయణ, విక్టర, జిల కర్ర నాగేంద్ర, జగ్గపల్లి నరేష్ , నల్ల రవికుమార్ వార్డు అభ్యర్థులు దొడ్డి కిరణ్, కనకన రెడ్డి, మురళి కృష్ణ, మహేష్, పిల్ల సూరి బాబు తదితరాలు పాల్గొన్నారు.

పెందుర్తి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హాజరై ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో త్యాగమూర్తులు త్యాగాల వల్లే మనకి స్వాతంత్రం వచ్చిందని వివరించారు. వారి త్యాగాలను నిరంతరం మననం చేసుకుంటూ దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. దేశరక్షణ కోసం పోరాడుతున్న సైనికుల త్యాగనిరతిని గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రదాని నరేంద్రమోదీ పాలనలో భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో బిజెపి పెందుర్తి నియోజవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, ఎంపిపి నాగమణి, వైఎస్ ఎంపిపి చిరికి దేముడుబాబు, ఎన్డీఏ నాయకులు గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నరవ హైస్కూల్లో స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడుతో కలిసి ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగుర వేసారు. అలాగే పురుషోత్తపురం కంఫోర్టు హోంలో టిడిపి నాయకులు ధాట్ల మధు అద్వర్యంలో జరిగిన ఇండిపెండెన్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే చిన్నముసిడివాడ డిజైర్ టు డిజైన్ ఇంజనీరింగ్ సంస్థ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పంచకర్ల ప్రారంభించారు.

విశాఖ విద్యార్థులు ఐఐటీల్లో స్థానం సంపాదించాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఐఐటి, ఎన్ఐటీల్లో విశాఖ విద్యార్థులు స్థానం సంపాదించాలని, ఆ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. 10వ తరగతిలో 575కు పైగా మార్కులు సాధించిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 62 మంది విద్యార్థుల అభినందన కార్యక్రమం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖలో అతి పెద్ద ప్రభుత్వ గృహాన్ని సందర్శించేందుకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణ నుంచి వచ్చిన జవహర్ నవోదయ విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటుందని విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని బంగ్లాలో ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 10వ తరగతిలో మంచిగా చదివి 600 మార్కులకు 575 పైబడి ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మీ జీవితంలో ఒక అడుగు ముందుకు వేశారని, తదుపరి ఇంటర్మీడియట్ లోకి అడుగు పెడుతున్నారని గుర్తుచేశారు. ఇక్కడితో విశ్రాంతి తీసుకోకుండా ప్రథమ, ద్వితీయ ఇంటర్ లో కూడా మంచి మార్కులు తెచ్చుకోవాలని కలెక్టర్ ఉద్బోధించారు. బాగా చదివే విద్యార్థులతో పోటీ పడాలని, అందుకు ఎక్కువ శ్రమించాల్సి ఉంటుందని అన్నారు. ఇంజినీర్,డాక్టర్, కలెక్టర్, జడ్జి, సైంటిస్ట్ ఇలా ఏదైతే కావాలని అనుకుంటున్నారో, అందుకు తగిన విధంగా పోటీ పడి విద్యను అభ్యసించాలని సూచించారు. అపుడే విద్యార్థులు అనుకున్న స్థాయికి చేరుకోగలరని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీ ప్రపంచంలో ఇతరులతో పోటీ పడి బాగా చదివితేనే ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి సీట్లు లభిస్తాయని అన్నారు. మీ కృషితో 10వ తరగతిలో విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో ఇంటర్ లో కూడా విజయభేరి మోగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు శుభాశీస్సులు అందజేశారు. ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ, జవహర్ నవోదయ వైస్ ప్రిన్సిపాల్ శరత్ చంద్ర కీర్తి, విశాఖ వేలి ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిలీనియంలో రక్తదాన శిబిరం

ఏటా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ అధినేత శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర- విశాఖపట్నం: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల సేవల్ని స్మరించుకుంటూ వేడుకల్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. విశాఖ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్నుద్దేశించి మిలీనియం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ది గిఫ్ట్ ఆఫ్ బ్లడ్ ఈజ్ ది గిఫ్ట్ ఆఫ్ లైఫ్'గా ఆయన అభివర్ణించారు. ఒకరి రక్తదానం ద్వారా ముగ్గురి ప్రాణాల్ని కాపాడొచ్చన్నారు. రక్తదాతల సేవల్ని కొనియాడుతూ వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రిపబ్లిక్ డే, పంద్రాగస్టు రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వారాడ రవికుమార్ తెలిపారు. 250మందికిపైగా విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. పీడీ డి.రామ్ రవి శంకర్, డాక్టర్ ప్రవల్లిక బి (విశాఖ బ్లడ్ సెంటర్) సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నారి కాజలితో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అందించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా విశాఖ నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ అవార్డును అందుకున్నారు. 2023 లో రాష్ట్ర శాంతిభద్రతల విభాగ అదనపు డీజీగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందజేసినందుకు గానూ పీపీఎంకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గురువారం విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భముగా ఈ ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ (పీపీఎం) ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు చేతులు మీదుగా విశాఖ నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, అందుకొని పోలీసు శాఖకు స్ఫూర్తి గా నిలిచారు. ఎస్.ఐ-2239 డి. సూరి బాబు 2022 ,2023 సంవత్సరముల లో క్రైమ్ విభాగమునకు చేసిన అత్యుత్తమ సేవలకు గానూ (ఐ.పి.ఎం) పోలీస్ మెడల్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్నారు. నగర క్రైమ్ బ్రాంచ్ నకు అత్యుత్తమ సేవలు అందించి ప్రతిష్టాత్మక (ఐ.పి.ఎం) పోలీస్ మెడల్ ను అందుకుని నగర పోలీసు శాఖకు స్ఫూర్తి గా నిలిచిన డి.సూరి బాబు, ఎస్.ఐ-2239 ను నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఈ సందర్భముగా తన అభినందనలు తెలియజేశారు.

సుదీప్త బెనర్జీ ఆధ్వర్యంలో వీణ కార్యక్రమం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద వీణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సుదీప్త బెనర్జీ ఆధ్వర్యంలో అమితవ చటర్జీ నేతృత్వంలో ఈ వీణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంగీతాలను వీణ ద్వారా వాయించి పలువుర్ని ఆకట్టుకున్నారు.